క్లుప్తంగా

రెవెన్యూ అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న చెన్నుడు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో పన్నులు, దుకాణాల బాడుగల వసూళ్లకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించని వారిపై చర్యలు తప్పవని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు హెచ్చరించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ అడ్మిన్ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను బకాయిలున్న ప్రతి ఒక్కరికీ నోటీసులను జారీ చేయాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను వచ్చే నెలాఖరు నాటికి సాధించాలని చెప్పారు. రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, సూపరింటెండెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



నెల్లూరు(బృందావనం): పడారుపల్లి దివ్యాంగుల కాలనీలోని ఆచార్య పీసీ రెడ్డి సమాజ మందిరంలో మహిళలకు చీరల పంపిణీతో పాటు అన్నదానాన్ని క్రాంతి మహిళా సేవా సదన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సదన్ అధ్యక్షురాలు గుమ్మడి వెంకటలక్ష్మి మాట్లాడారు. దొడ్ల కృష్ణారెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని ఆయన సతీమణి ప్రమీలమ్మ.. తోటపల్లి భాస్కర్‌రెడ్డి స్మృత్యర్థం ఆయన కుమార్తె మమతారెడ్డి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. దొడ్ల సరళ, శివకోటారెడ్డి, కొండూరు వెంకట సుధాకర్, హరినాథ్‌రెడ్డి, స్వర్ణ గంగాధర్, అనిల, సుధ, విజయలక్ష్మి, దగ్గుపాటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుద్ధ కానుక మాత సప్రమహోత్సవం



నెల్లూరు(బృందావనం): కపాడిపాళెంలో పరిశుద్ధ కానుకమాత సప్ర మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలను ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి జరిపారు. పార్టీ నేతలు బాలప్రసాద్, సందీప్, వరప్రసాద్, సరిత, శౌరి, మస్తానీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దత్తనాథ క్షేత్ర పర్యటన



పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానంద

నెల్లూరు(బృందావనం): మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద, దత్త పీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థ చేపట్టిన దత్తనాథ క్షేత్ర నెల్లూరు పర్యటన మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ, అష్టలక్ష్మి మందిర ప్రాంగణంలో గల రాధాకృష్ణ ధ్యాన మండపం వద్ద రథసప్తమి వేడుకలను నిర్వహించారు. సూర్యభగవానుడికి విశేష పూజలు, అర్చనలు తదితరాలను జరిపారు. భక్తులకు మంగళశాసనలను గణపతి సచ్చిదానంద అందజేశారు. అనంతరం కడప పయనమయ్యారు. గణపతి సచ్చిదానంద కృష్ణ జ్ఞాన బోధ సభ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్, ట్రస్టీలు పచ్చిపాల ప్రమీలమ్మ, అనపల్లి మస్తాన్‌రెడ్డి, అనపల్లి అశోక్‌రెడ్డి, ఫణి రత్నం, డాక్టర్ వెంకటేశ్వర ప్రసన్న, రేబాల పట్టాభిరామిరెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్య సంఘాన్ని బలోపేతం చేద్దాం



మాట్లాడుతున్న రవీంద్రబాబు

నెల్లూరు(బృందావనం): జిల్లాలో గ్రామీణ వైద్య సంఘాన్ని బలోపేతం చేయాలని జిల్లా గ్రామీణ వైద్య సంఘ అధ్యక్షుడు రవీంద్రబాబు పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో సంఘ కార్యవర్గ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సభ్యులు రోజారాణి, గోవింద స్వామి, వెంకటసుబ్బయ్య, శేషయ్య, గౌస్, ముజాహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ వెతలు..?

నగరంలోని రామలింగాపురం అండర్ బ్రిడ్జిపై మురుగు నిల్వ ఉంటోంది. వర్షాకాలం, ఎండాకాలమనే తేడా లేకుండా నిత్యం ఇక్కడ ఇదే సమస్య నెలకొంటోంది. పంపింగ్ మెషీన్‌తో ఎన్నిసార్లు తోడిస్తున్నా, సమస్య మళ్లీ మొదటికొస్తోంది. ఫలితంగా వాహనదారులకు నరకయాతన తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో వాహనాలు అదుపు తప్పి పలువురు పడి గాయపడుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా పాలకులు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెల్లూరు సిటీ







పన్నుల వసూళ్లను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నిర్దేశించిన పన్నుల వసూళ్ల లక్ష్యాలను సాధించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్, హౌసింగ్ విభాగాధికారులు, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిలున్న యజమానులకు నోటీసులను జారీ చేసి, నిర్దేశించిన సమయంలోపు చెల్లించకపోతే తాగునీటి కుళాయి కనెక్షన్లను తొలగిస్తామనే విషయాన్ని తెలియజేయాలని సూచించారు.

➡ నగరంలో వీధి దీపాలను వారంలోపు అమర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 30 మంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించి నగరంలో ప్రక్రియ పూర్తయ్యేలా పర్యవేక్షించాలని విద్యుత్ శాఖ ఎస్‌ఈ విజయన్‌కు సూచించారు. సెంట్రల్ లైటింగ్ విధానాన్ని నగరంలోని ఐదు కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ బిజిలీ యోజనను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరంలో ఏడు వేల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను గుర్తించి వారిళ్లలో రూ.140 కోట్లతో సోలార్ విద్యుత్ పలకలను ఉచితంగా అమర్చేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని ప్రకటించారు. నగరంలో పూర్తయిన 17,520 టిడ్కో గృహాల్లో 7636 ఇళ్లను సంబంధిత లబ్ధిదారులు స్వాధీనం చేసుకున్నారని, మిగిలిన చోట్లా లబ్ధిదారులు చేరేలా చొరవ చూపాలన్నారు.

➡ ఎనిమిదో డివిజన్లోని పత్తివారి స్కూల్ మెయిన్ రోడ్డు, కుమ్మరివీధి, గాండ్లవీధి, ముకుందపురం, లక్ష్మీసాయినగర్, బీవీఎస్ బాలికోన్నత పాఠశాల మెయిన్ రోడ్డు, తడికలబజార్, ఆరెస్సార్ స్కూల్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం



నెల్లూరు(అర్బన్): కేన్సర్‌పై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. పరిసర ప్రాంతాల్లో ర్యాలీని వైద్య సిబ్బందితో జరిపారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, డీఐఓ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటించడం ద్వారా నిర్మూలించొచ్చు

నెల్లూరు(అర్బన్): తగు జాగ్రత్తలు పాటిస్తూ, మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా కేన్సర్‌ను నిర్మూలించొచ్చని రెడ్‌క్రాస్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులోని కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో వ్యాధిని జయించిన రోగులతో కలిసి ఆమె మంగళవారం మాట్లాడారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైద్యులు రామ్మోహన్‌రావు, గీతా ఉషశ్రీ, లోకేశ్వరి, హరితరాణి, ముత్తు, హేమంత్, హాస్పిటల్ జీఎం భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివారణకు కృషి



మాట్లాడుతున్న శ్రీరామ్ సతీష్

నెల్లూరు(అర్బన్): కేన్సర్ నివారణకు దేశంలోని అన్ని అపోలో ఆస్పత్రుల ద్వారా కృషి చేస్తున్నామని ఆస్పత్రి డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్ పేర్కొన్నారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హరనాథపురంలోని అపోలో ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని తమ ఆస్పత్రుల్లో కేన్సర్ కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని తమ హాస్పిటల్లో తక్కువ ఖర్చుకే స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్నామని వివరించారు. 24 గంటలూ పనిచేసే 040 – 48964515 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి తగు సమాచారాన్ని పొందొచ్చని చెప్పారు. ఆంకాలజిస్ట్ హరిత, సర్జికల్ ఆంకాలజిస్ట్ మనోభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

28 వరకు ఉచిత పరీక్షలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బిందురెడ్డి తదితరులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో మహిళలకు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఈ నెల 28 వరకు నిర్వహించనున్నామని ఆస్పత్రి సెంటర్ హెడ్ బిందురెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను నుడా కార్యాలయంలో చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. పాప్‌స్మియర్, మామోగ్రఫీ, ఇతర రక్త పరీక్షలను చేయనున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెడికవర్ మార్కెటింగ్ హెడ్ సతీష్, పీఆర్వో చందువర్మ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాస్పత్రికి వీల్‌చైర్లు, ట్రై సైకిళ్ల వితరణ

నెల్లూరు(అర్బన్): పెద్దాస్పత్రికి రెండు వీల్‌చైర్లు, రెండు ట్రైసైకిళ్లను సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్ర నిర్వాహకులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్దానాయక్ మాట్లాడారు. సదరమ్ క్యాంప్ ద్వారా దివ్యాంగుల పింఛన్ల సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ ప్రస్తుతం జరుగుతోందని చెప్పారు. ప్రక్రియ జూన్ వరకు కొనసాగనుందని వెల్లడించారు. రెండో రోజు 300 మంది సర్టిఫికెట్లను పరిశీలించామని, వారితో పాటు వచ్చిన సహాయకులకు భోజనాలు, తాగునీరు తదితర వసతులను కల్పించామన్నారు.

జేఎల్ఎం గ్రేడ్ - 2 ఎనర్జీ అసిస్టెంట్ల సదస్సు



మాట్లాడుతున్న సూరిబాబు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న జేఎల్ఎం గ్రేడ్ – 2 ఉద్యోగులకు సదుపాయాలను కల్పించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో మంగళవారం నిర్వహించిన జేఎల్ఎం గ్రేడ్ – 2 ఎనర్జీ అసిస్టెంట్ల జిల్లా సదస్సులో వారు మాట్లాడారు. తాము సచివాలయ ఉద్యోగులమా లేక విద్యుత్ ఉద్యోగులమాననే సందిగ్ధంలో వీరున్నారని చెప్పారు. వీరిని విద్యుత్ సంస్థ ఉద్యోగులుగా పరిగణించాలని డిమాండ్ చేశారు. నేతలు పెంచలప్రసాద్, జాకీర్‌హుస్సేన్, హజరత్తయ్య, మహేష్, రామయ్య, సునీల్, ప్రసన్నకుమార్‌రెడ్డి, హరినారాయణ, నాగయ్య, బొజ్జా సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చేసి.. నగదు కొల్లగొట్టి

నెల్లూరు(క్రైమ్): సాయం ముసుగులో ఓ వృద్ధుడి ఏటీఎం కార్డును మార్చేసి నగదును గుర్తుతెలియని దుండగుడు దోచేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ముత్యాలపాళెంలో నివాసం ఉంటున్న దేవదాసు తన ఏటీఎం కార్డు పిన్ మార్చుకునేందుకు గానూ బారకాస్‌లోని ఎస్బీఐ ఏటీఎం కేంద్రానికి వెళ్లారు. గుర్తుతెలియని వ్యక్తి అతనితో మాటలు కలిపి ఏటీఎం కార్డు పిన్ మార్చేందుకు వచ్చారనే అంశాన్ని తెలుసుకున్నాడు. అనంతరం పిన్ మార్చిస్తానని దేవదాసు ఏటీఎం కార్డు తీసుకొని దాని స్థానంలో నకిలీ కార్డు ఇచ్చి అక్కడి నుంచి జారుకున్నారు. కార్డును మెషీన్లో దేవదాసు పెట్టగా, అది తనది కాదని తేలింది. గుర్తుతెలియని వ్యక్తి కోసం గాలిస్తుండగానే తన ఖాతాలో రూ.34 వేలు డ్రా అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. మోసపోయానని గ్రహించిన బాధితుడు చిన్నబజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): మహిళపై స్నేహితుడు దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. చాకలివీధికి చెందిన ఓ మహిళ.. వరుణ్‌తో రెండేళ్లుగా సహజీవనం చేస్తున్నారు. మద్యం మత్తులో నగదు ఇవ్వాలని ఆమెను డిమాండ్ చేయడం, ఇవ్వకపోతే దాడి చేయసాగారు. ఈ క్రమంలో పూటుగా మద్యం సేవించి ఆమెపై సోమవారం దాడి చేశారు. గాయపడిన ఆమె జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

నెల్లూరు సిటీ: పరీక్ష రాసేందుకు వెళ్లి యువతి అదృశ్యమైన ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వివరాలు.. ఒంగోలుకు చెందిన యువతి ముత్తుకూరు మండలంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఫార్మా కోర్సును చదువుతున్నారు. ఈ క్రమంలో కాకుపల్లిలో ఓ కళాశాలలో పరీక్ష రాసి హాస్టల్‌కు చేరుకోలేదు. ఈ విషయమై తల్లిదండ్రులకు సిబ్బంది సమాచారమిచ్చారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో..

నెల్లూరు(క్రైమ్): ఇంటి నుంచి బాలిక అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. కల్యాణ్‌నగర్‌లో నివాసం ఉంటున్న భారతి కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె పెద్ద కుమార్తె ఇంటి నుంచి సోమవారం మధ్యాహ్నం బయటకెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో గాలింపు చర్యలను కుటుంబసభ్యులు చేపట్టారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు తల్లి ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరణి కందప్ప జయంతి

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని ఆరణి కందప్ప మేస్త్రి సత్ర నిర్మాణదాత కందప్ప మేస్త్రి జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు.. నిరుపేదలకు దుప్పట్లు, దోమతెరలు.. పేద బ్రాహ్మణ దంపతులకు వస్త్రాల పంపిణీ తదితర సేవా కార్యక్రమాలను నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, కార్పొరేటర్ రామకృష్ణ, టీడీపీ నేతలు కప్పిర శ్రీనివాసులు, రేవతి తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల పోస్టులకు 17 నుంచి ఇంటర్వ్యూలు

నెల్లూరు సిటీ: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు సంబంధించిన టీచర్ల పోస్టులకు ఇంటర్వ్యూలను ఈ నెల 17 నుంచి 19 వరకు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ శంకరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల, హిందీ భాషల్లో బోధించగల సామర్థ్యం ఉండాలని చెప్పారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒక సెట్ జిరాక్స్ కాపీని తీసుకొని ఇంటర్వ్యూల తేదీల్లో ఉదయం తొమ్మిది గంటల్లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు kothuru.kvs.ac.in ను సందర్శించాలని కోరారు.

ఉద్యోగాలకు 30 మంది ఎంపిక

నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ ఫార్మసీ కళాశాలలో క్యాంపస్ ఎంపికలను ఏజీఎస్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూల అనంతరం 39 మందిని మెడికల్ కోడింగ్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఏజీఎస్ హెల్త్ మేనేజర్ రాజేష్, సభ్యులు సందీప్, శివ, వైస్ ప్రిన్సిపల్ సుజాత, ప్లేస్‌మెంట్ అధికారి భరత్ కుమార్ పాల్గొన్నారు.

నేత్రదానం



సర్టిఫికెట్‌ను అందజేస్తున్న టెక్నీషియన్

నెల్లూరు(అర్బన్): బాలాజీనగర్‌కు చెందిన పద్మిని (70) మంగళవారం మృతి చెందారు. ఈ క్రమంలో సింహపురి దేహ సమర్పణ సంస్థ కన్వీనర్ విజయ సహకారంతో కుటుంబసభ్యుడు మాధవరావు అంగీకారంతో ఆమె నేత్రాలను నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రికి దానం చేశారు. ఎల్వీ ప్రసాద్ ఐ టెక్నీషియన్ సునీల్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 94415 83839, 99595 89321 నంబర్లను సంప్రదించాలని సునీల్ కోరారు.

రహదారి భద్రతపై అవగాహన



నెల్లూరు (టౌన్): రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పలు పాఠశాలల విద్యార్థులకు రవాణాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఎల్ఎల్ఆర్‌ను పొందే విధానం, ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను చూపించారు. ట్రాక్‌లో వాహనాన్ని ఏ విధంగా నడపాలో వివరించిన అనంతరం ఎంవీఐ బాలమురళీకృష్ణ మాట్లాడారు. లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్‌ను విధిగా ధరించాలని చెప్పారు. ఎంవీఐలు మహమ్మద్ రఫీ, కార్తీక్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్ద చెరుకూరులో పొలం పిలుస్తోంది



నెల్లూరు సిటీ: పెద్దచెరుకూరు, కనుపర్తిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాలను వ్యవసాయాధికారులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ మండల వ్యవసాయ సంచాలకుడు శ్రీనివాసులు మాట్లాడారు. రసాయన ఎరువులను వినియోగిస్తే సాగు ఖర్చు పెరుగుతుందని చెప్పారు. వ్యవసాయాధికారి నాగమోహన్, వ్యవసాయ విస్తరణాధికారి శేషాద్రి పాల్గొన్నారు.

హాస్టల్లో తనిఖీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రభుత్వం అందజేస్తున్న ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. దర్గామిట్ట శాంతినగర్‌లోని ప్రభుత్వ బీసీ కాలేజీ, గర్ల్స్ హాస్టల్‌ను మంగళవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ హాస్టళ్ల ద్వారా విద్యార్థులకు అందిస్తున్న ప్రతి సదుపాయాన్ని అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కాంక్షించారు. చదువు ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమాజంలో ఉన్న దురాచారాలను ఎదుర్కొని బాలికలు మంచి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులు చదువు ద్వారా ఏమైనా సాధించొచ్చని వివరించారు. హాస్టల్ పనితీరు, పరిసరాలు, నిర్వహణను అభినందించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటలక్ష్మి, వార్డెన్ రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



నెల్లూరు (టౌన్): జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ – 14 సాఫ్ట్‌బాల్ పోటీలకు రవీంద్ర భారతి స్కూల్ విద్యార్థి మిషాల్ ఎంపికయ్యారని స్కూల్ జోనల్ ఇన్‌చార్జి శ్రీహరి తెలిపారు. ఫతేఖాన్‌పేటలోని స్కూల్లో విద్యార్థిని మంగళవారం అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఈ నెల 13 నుంచి నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నారని చెప్పారు. ప్రిన్సిపల్ వంశీ, పీఈటీ వంశీ పాల్గొన్నారు.

ఎమ్మెన్వోలను నియమించాలని వినతి

నెల్లూరు(అర్బన్): నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రి కాజ్యువాల్టీ, ఐసీయూలో తగినంత మంది సిబ్బందిని నియమించి తమపై పనిభారం తగ్గించాలని ఎమ్మెన్వోలు కోరారు. ఈ మేరకు పెద్దాస్పత్రిలో సూపరింటెండెంట్ సిద్దానాయక్‌కు వినతిపత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం ఎమ్మెన్వోలు మల్లి, రవి మాట్లాడారు. 200 మంది వరకు పని చేయాల్సిన చోట 20 మంది ఎమ్మెన్వోలు, ఎఫ్ఎన్వోలే ఉన్నారని చెప్పారు. అదనపు సిబ్బందిని నియమించాలని కోరారు. రాజేంద్ర, కృష్ణవేణి, ఖాదర్‌బీ, యోబు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాపీఠ సంస్థాపన మహోత్సవం

నెల్లూరు(బృందావనం): శంకరభగవత్పాదులు స్థాపించిన పశ్చిమామ్నాయ ద్వారకాపీఠ సంస్థాపన మహోత్సవాన్ని పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్, ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పద్యకవి డాక్టర్ సింగరాజు శివరామకృష్ణారావు ఉపన్యసించారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. సురభి మహాలక్ష్మి బృందంతో సౌందర్యలహరి గానాలను ఆలపించారు. చక్రాలవారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనందకుమార్, మేనేజర్ వెంకట లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో సర్వే పూర్తి

నెల్లూరు (పొగతోట): సోమశిల, కండలేరు జలాశయం నుంచి ప్రతి గ్రామానికి మంచినీరు సరఫరా చేసేందుకు చేపడుతున్న ప్రాజెక్టుకు సంబంధించిన సర్వేను సకాలంలో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ వెంకటరమణ ఆదేశించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఏఈలు, డీఈలు, ఇతర ప్రాజెక్టు అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈఈ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని నగరంలో భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రంగడు సర్వాలంకారశోభితంగా సప్తవాహన సేవల్లో కొలువై భక్తులకు కటాక్షించారు. స్నపన తిరుమంజనాన్ని నిర్వహించారు. వివిధ వాహనాల్లో విహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

➡ వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఉభయకర్తలుగా కొలపర్తి వెంకటరమేష్ కుమార్, రాజా మనోజ్‌కుమార్, దాసా వెంకటేశ్వర్లు తదితరులు వ్యవహరించారు.

➡ మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సూర్యనారాయణుడికి విశేష పూజలను నిర్వహించారు.

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో సప్తవాహన సేవలను నిర్వహించారు. తొలుత చక్రస్నానాన్ని జరిపారు. తదుపరి ఏకాంతసేవను నిర్వహించారు. ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, ఈఓ వేమూరి గోపీ, అర్చకులు కృష్ణమాచార్యులు, మురళీధరాచార్యులు, అప్పలాచార్యులు, రాఘవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన శ్రీదేవీ, భూదేవీ సమేత వెంకటేశ్వరస్వామికి సూర్యప్రభ వాహనసేవ నిర్వహించారు. అనంతరం హనుమంతసేవ, గరుడసేవ, చక్రస్నానం, తిరుచ్చి ఉత్సవం తదితరాలను జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు సాయి భరద్వాజ, కమిటీ చైర్మన్ నాగిరెడ్డి పర్యవేక్షించారు.



రంగనాథుడి దేవస్థానంలో..



వెంకటేశ్వరపురంలో..



వేదగిరిలో..



వేణుగోపాలస్వామి దేవస్థానంలో..



కోలాట ప్రదర్శన



విహరిస్తున్న ధర్మరాజస్వామి